



# గుట్టు విప్పిన గడియారం

ఎలక్ట్రాన్

**విశ్వనిర్ధారితమైన కక్ష్యలో, సమయంలో భూమి ఆత్మప్రదక్షిణలు చేస్తూనే సూర్యుని చుట్టూ కూడా పరిభ్రమిస్తోంది. కాలప్రమాణంలో మార్పు లేకపోయినా కాల స్వభావంలో మార్పు గోచరిస్తోంది.**

కృతంలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచిందో లేదో చెప్పడం కష్టం కానీ, కలిలో మట్టుకు చెప్పినట్టుగా, ఖచ్చితంగా ఒంటిపాదం మీదనే గెంతుతోంది. కారణం ఏమిటీ అంటే శాస్త్రపరంగా మారని కొలమానాలనీ, ప్రమాణాలనీ సృష్టించిన మానవ సమాజం జీవన విధానాలకు ప్రమాణాలనీ, విలువలనీ మార్చుకుంటూ పోవడమే.

స్నానం చేసి వచ్చిన సుజాత తన బల్లమీద దేనికోసమో వెతకసాగింది. ప్రయోగ లేఖ్య పుస్తకంలో రాసుకొంటున్న రమ్య తలెత్తి చూసి, "దేనికోసమో వెతుకుతున్నట్లున్నావు?" అని ప్రశ్నించింది.

"నిన్న సాయంత్రం నా పుట్టిన రోజు కానుక అని చూపించానే ఆ సంఖ్యా సంకేత హస్త ఘటీ యంత్రం (చేతి వాచీ) కాని చూశావా?" సుజాత రమ్యని అదోలా చూస్తూ అడిగింది.

"చూశావా అనడంతో సరిపెట్టావు, తీశావా అని అడగలేదు. అయినా వసతిగృహ జీవితంలో ఎవరి గదిలో, ఎవరిది, ఎప్పుడు, ఎలా ఏ వస్తువు పోయినా సహవాసి మీద అనుమానం సహజంగా కలుగుతుంది. వస్తువు పోయిన వ్యక్తి అనుమానంగా చూస్తుంటే, సహవాసికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది" అంది రమ్య.

"ఎందుకే అంతంత మాటలంటావు? చేతి గడియారం కనబడక నేనేడుస్తుంటే, మధ్యలో నీ సొదేమిటి?" సుజాత విసుగ్గా అంది.

"ఉన్న వాస్తవాన్ని చెప్పానంతే. గదంతా వెదికినా నీ చేతి గడియారం కనబడలేదనుకో మనస్సు ఒప్పుకోక పోయినా, పైకి అనకపోయినా అంతరాంతరాల్లో నా మీద అనుమానపు బీజం నాటుకుంటుందా లేదా చెప్పు?" అంది రమ్య.

"మహాతల్లీ నీకో నమస్కారం. నువ్వు తీశావని అనలేదుగా?"

"తీశావని అనకపోయినా, తీసి ఉంటానని అనుకొన్నావా, లేదా?" రమ్య రెట్టించి అడిగింది.

రమ్య మాటలు సుజాతకి రుచించలేదు. తన బల్ల సొరుగు సగం పైకి లాగి చూసింది. ఇనుప బీరువాలోని తన అర్ధభాగంలోనూ, పుస్తకాల గూట్లోనూ వెదికింది. ఆ తర్వాత కుర్చీలో కూలబడింది. రమ్య లేచి వెళ్ళి, సుజాత భుజం మీద చెయ్యి వేసి, "ఏమీ అనుకోకపోతే ఓమాట చెప్తాను, చేస్తావా?" అంది.

"ఏమిటట?" సుజాత పెడసరంగా అంది.

"నా బల్ల సొరుగూ, ఇనుప బీరువాలోని నా అర్ధభాగమూ, నా పుస్తకాల గూడూ అన్నీ వెదుకు. లేకపోతే ఈ రాత్రికి నాకు నిద్ర పట్టదు" అంది రమ్య.

సుజాతకీమాట నిజంగా తిక్క రేగింది.

"ఇందాకట్నుంచీ చూస్తున్నాను నీ వరస! సరేలే, నువ్వు నేనేం అనుకోవాలని అనుకొన్నావో అదే అంటున్నాను. నువ్వే ఆ చేతి గడియారాన్ని తీసి, ఎక్కడో దాచి, నీ నిర్దోషిత్వాన్ని ఋజువు చేసుకొనేందుకు నీ పెట్టే బేడా వెదకమంటున్నావు! అలాగే చేస్తాను, నీ భాగం బీరువా తాళం ఇవ్వు," అంది కోపంగా.

"నా భాగం తాళం పోయిందనీ, ఉన్నా తాళం వెయ్యననీ నీకు తెలుసు."

సుజాత రమ్య భాగం బీరువా తలుపు తీసి, బట్టలన్నీ చిందరవందర చేస్తూ వెదికింది. బల్ల సొరుగు తీసి బోర్లించింది. గూట్లోంచి పుస్తకాలన్నీ బయటకు లాగి చూసింది. రమ్య పడుకునే మంచం మీది పరుపునెత్తి చూసింది. మంచం కిందనున్న ఖాళీ పెట్టెని బయటకు లాగి, మూత తెరిచి చూసింది. అటుపైన "సరే ఇంకా ఎక్కడ వెదకాలో చెప్పు" అంది వెటకారంగా.


రమ్య సుజాతకి ఎదురుగా నిల్చుని జుట్టుముడి విప్పింది. చున్నీ నిలేసి కుర్చీమీద వేసి "నా దుస్తుల్లో ఎక్కడైనా దాచానేమో చూసుకో. కావాలంటే యివీ తీసేస్తాను" అంది కవ్విస్తూ.

సుజాత ఒక్క క్షణం విస్తుపోయింది. "సరే ఆ సరదా కూడా తీరుస్తాను" అంటూ రమ్య శరీరాన్ని తడిమి చూసింది. "సృష్టికర్త నీకింత అందమైన శరీరాన్నిచ్చాడు కానీ వక్రబుద్ధిని ప్రసాదించాడు."

రమ్య చున్నీని మెడ మీదుగా వేసుకొని అంది, "నీ చేతి గడియారం గదిలో లేదని నిర్ధారణ అయింది. ఇకపోతే, నేను దాన్ని కాజేసి బయట ఎక్కడైనా దాచానా? లేదా, బయటి వాళ్ళెవరైనా వచ్చి తీసుకుపోయారా? లేదా తమరే మతిమరపుతనంతో ఎక్కడైనా జారవిడుచుకున్నారో? ఏ విషయం తేలందే నీకు నా మీద అనుమానం తప్పదంటాను."

"పోయిన గడియారానికో దణ్ణం పెట్టి ఊరుకొంటాకానీ, సంగతి మట్టుకు ఈ గది దాటి బయటకు వెళ్ళడానికి వీలులేదు." సుజాత మాటల్లో ఆజ్ఞా ఉంది, అర్థింపూ ఉంది.

"నువ్వు వెర్రిభ్రమలో ఉన్నావు. ఎప్పట్నుంచి పొంచి వింటోందో నేను గమనించలేదుకానీ, కిటికీ పక్క నుంచి నవ్య ఇప్పుడే చల్లగా జారుకొంది. ఉన్న సంగతికి కొత్త సంగతులు కలిపి నవ్య ఏవిధమైన ప్రచారం చేస్తుందో త్వరలోనే తెలుస్తుంది. పద తరగతికి వెళ్ళే సమయమైంది" అంది రమ్య.



శ్రీ వెంకటేశ్వర తెలుగు విద్యాలయం స్వర్ణోత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీ పి. ఓబుల్ రెడ్డి గారిని నిర్వాహకులు సత్కరిస్తున్న దృశ్యం. వెంకటేశ్వర తెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు శ్రీ ఓబుల్‌రెడ్డి **50** వేల రూపాయలను విరాళంగా అందజేసారు.

ఎడమ నుంచి : శ్రీమతి సరోజ గురుస్వామి (కో ఆర్డినేటర్), ప్రీతారెడ్డి (మేనేజింగ్ డైరెక్టర్ - అపోలో హాస్పిటల్స్), శ్రీ ఎం. నరసింహాచార్య (మద్రాసు విశ్వ విద్యాలయం వైష్ణవిజం శాఖ మాజీ అధ్యక్షుడు), శ్రీ పి. ఓబుల్ రెడ్డి (ప్రముఖ పారిశ్రామిక వేత్త), శ్రీమతి శమంతకమణి (మద్రాసు విశ్వవిద్యాలయం, తెలుగుశాఖ అధ్యక్షురాలు), శ్రీ వి.జి.ఎస్.వి. ప్రసాద్ (అధ్యక్షుడు- శ్రీ వెంకటేశ్వర తెలుగు ఎడ్యుకేషన్ ట్రస్ట్)

ఆ సాయంత్రానికల్లా అందరి నోటా ఒకటే చర్చ. "పోయిన గడియారం సహవాసి తీసిందన్న అనుమానం ఉన్నంత మాత్రాన, సుజాత రమ్యచేత దుస్తులు విప్పిస్తుందా?" అని.

తరగతులు ముగిసిన తరువాత గది చేరుకున్న సుజాతని గొడవ చెయ్యొద్దని ముందుగానే హెచ్చరించి, "ఆ గడియారం నీకు పుట్టినరోజు కానుకగా మీ నాన్నగారు పంపించారని చెప్పావు. కానీ దాన్ని నీకిచ్చింది రాకేష్ అనే యువకుడు కదూ? నిజం చెప్పు" అని రమ్య నిలదీసి అడిగింది.

సుజాత మౌనంగా ఉండిపోయింది.

"సుజాతా, ఈ గడియారం గొడవ తేలే వరకూ నేనేం చేసినా నోరెత్తకు. ఇందులో నీ మంచీ ఉంది, మనందరి మంచీ ఉంది" అంది రమ్య.

"ఈ విషయం మా నాన్నగారికి తెలిస్తే, తను ఇవ్వని చేతి గడియారం పోవడమేమిటని నిలదీస్తారు. ఆ భయంతోనే నేను నోరు మూసుకొని కూర్చుందామనుకుంటే, నువ్వే లేనిపోని కల్లోలం సృష్టించావు" అంది సుజాత నిష్ఠూరంగా. రమ్య 'నేనున్నానుగా, నీకేమీ భయం లేద'న్నట్టుగా సుజాత భుజం మీద తట్టింది.


చీకటి పడిన తర్వాత ఏడు గంటల ప్రాంతంలో నవ్య ద్వారా కబురందుకొని ఇద్దరూ వసతిగృహ సంరక్షకురాలు శ్యామలాదేవి నివాస గృహానికి వెళ్ళారు. వాళ్ళని నవ్యా, ఆమె స్నేహితురాళ్ళు కొంతమందీ కొంత దూరంలో వెంబడించారు.

శ్యామలాదేవి ఠీవిగా దిళ్ళ కుర్చీలో కూర్చుని, రమ్యా సుజాతలని నిలబెట్టి ప్రశ్నించింది. "నేను విన్నది నిజమేనా?"

"ఏం విన్నారు?" రమ్య తిరిగి ప్రశ్నించింది.

"అదే, తన చేతి గడియారాన్ని నువ్వే తీశావన్న అనుమానం కొద్దీ సుజాత నీ చేత దుస్తులన్నీ ఒలిపించి పరీక్ష చేసిందని?"

"మీకెవరు చెప్పారో తెలియదు కానీండి, మీరు విన్నది కొంతవరకే నిజం. పోయింది గడియారం కాదు, వంటి పేట బంగారపు గొలుసు. కావలిస్తే దుస్తులు కూడా విప్పించి తనిఖీ చేసుకోమన్నది నేనే. తనకి నా మీద



## విజయం

**మధురమైన ఊహాలు మనసుని రంజింప చేస్తాయి!**
**ఊహాలు వాస్తవాలైతే మనసు మయూర నాట్యం చేస్తుంది!**
**నువ్వు ప్రేమించిన వ్యక్తి నిన్ను ప్రేమిస్తే,**
**విశ్వమంతా రంగుల హరివిల్లులా కనిపిస్తుంది.**
**ఆకాశాన్ని అందుకోవాలని,**
**మేఘాలలో నడుచుకుంటూ వెళ్లాలని,**
**చుక్కల్ని లెక్క పెట్టాలని,**
**వర్షపు చినుకుల్ని గుప్పెట ముయ్యాలని,**
**ఇంద్రధనుస్సు నెక్కి కూర్చోవాలని.....**
**అనిపిస్తుంది!?!**
**కాని విధి ఎదురు తిరిగితే,**
**అదృష్టం ఆమడ దూరం పరుగెడితే,**
**ఆ మనసే నిరాశా-నిస్పృహాలకు లోనవుతుంది??!**
**మనసుని చంపుకోలేక (నీకు) చావాలనిపిస్తుంది!**
**కాని 'చావు' నీ సమస్యకు పరిష్కారం కాకూడదు.**
**అందమైన జీవితాన్ని అపహాస్యం చెయ్యకూడదు!!!**
**జీవితంతో పోరాడి 'విజయం' సాధించాలి!**

**-శ్రీమతి న్యాయపతి కమలారాంజీ**

ఏమాత్రం అనుమానమున్నా సహవాసులుగా ఉండడం దుర్భరమైపోయింది. అనుమాన నివృత్తి ఎంత త్వరగా అయితే అంత మంచిది కదండీ?" రమ్య అమాయకతలో కొంటెతనం రంగరించి అంది.

సుజాత ఏదో అనబోయి ఊరుకుంది. తనకేసి పరీక్షగా చూస్తున్న శ్యామలాదేవిని చూస్తూ, రమ్య చెప్పిన మాటలు నిజమే నన్నట్లుగా బుర్ర ఊపింది.

"అంటే గడియారం గాయబు కావడం ఉత్తిదన్నమాట?" శ్యామలాదేవి విస్తుబోతూ ప్రశ్నించింది.

సుజాత తన ఎడమ చేతిని చూపించింది. చిలకలూరిపేట బంగారపు గొలుసుతో చిన్న చేతిగడియారం చూడముచ్చటగా ఉంది.

"ఏదో సంఖ్యా సంకేత గడియారం పోయిందని విన్నాన్లే" అంది శ్యామలాదేవి నసుగుతూ.

"సుజాతా, నువ్వు నాకు చూపించిన పుట్టినరోజు కానుక - అదే ఆ సంఖ్యా సంకేత గడియారాన్ని నిన్న నీ బల్ల సొరుగులో పెట్టావుకదటే? ఈ ఉదయం నువ్వు నాతో గొలుసు పోయిన సంగతే చెప్పావుకానీ, అది కూడా పోయిన సంగతి చెప్పలేదేం?" రమ్య గంభీరంగా ప్రశ్నించింది.

సుజాతకి మతిపోయింది. "రమ్య ఏం మాట్లాడుతోంది? ఇందులో ఏదో మతలబు ఉంది" అని ఆలోచిస్తూ పైకి అంది. "ఈ ఉదయం గడియారం కోసం బల్లమీదే చూశాను కానీ బల్ల సొరుగులో సరిగా లోపలికంటూ చూడలేదు. సొరుగులోనే ఉండి ఉంటుంది. ఇప్పుడు గదికి వెళ్ళిన తర్వాత సరిగా చూస్తాన్లే."

"సరే, మీరు వెళ్ళండి" అంది శ్యామలాదేవి చికాకుగా.

"గొలుసూ, గడియారమూ కనబడని పక్షంలో రక్షకభట కార్యాలయంలో విషయం చెప్పి నమోదు చేయిస్తే బావుంటుందే మోనండీ?" రమ్య శ్యామలాదేవి అనుమతి కోరుతున్నట్టుగా అడిగింది.

"ముందస్తుగా వాళ్ళూ నిన్నే అనుమానిస్తారు. మన విద్యాసంస్థ పేరూ, వసతిగృహం పేరూ దెబ్బ తింటాయి. ముందు పోయి సరిగా వెదకండి. పై సంగతి తర్వాత ఆలోచిద్దాం" అని శ్యామలాదేవి వాళ్ళని పంపివేసింది.

వాళ్ళూ అటు వెళ్ళగానే, వెనక వసారాలో తచ్చాడుతున్న నవ్య స్నేహబృందంతో ముందు గదిలో ప్రవేశించి, "వాళ్ళు ఘర్షణ పడింది గడియారం కోసం కాని గొలుసు పోయిందని కాదండి. ఎందుకో ఇద్దరూ అబద్ధమాడుతున్నారు" అంది శ్యామలాదేవితో.

"మీ మాటలు విని వాళ్ళని మందలిద్దామని పిల్చాను. నా బుర్ర వాచిపోయింది. పోయి చదువుకోండి" అంది శ్యామలాదేవి. వాళ్ళు బిక్కమొహాలు వేసుకొని వెళ్ళిపోయారు.

గదికి వెళ్లగానే రమ్య బీరువా కిందనున్న తన కాయపుష్టి శిక్షణా పాదరక్షలని బయటకు లాగి, ఎడమ జోడులో ఉన్న చేతి గడియారాన్ని తీసి సుజాత బల్ల మీద ఉంచింది.

"అంటే దీన్ని నువ్వే తీసి, ఈ గదిలోనే దాచి ఇంత గొడవ చేశావన్నమాట? ఇంతకీ నువ్వాడుతున్న నాటకమేమిటి?" సుజాత కోపం ప్రదర్శిస్తూ అడిగింది.

"ఉష్! నవ్యా వాళ్ళూ వస్తున్నారనుకుంటాను. నేను నీ మీద గట్టిగట్టిగా కేకలు వేస్తాను. అప్పుడు నువ్వు నాకు క్షమార్పణలు చెప్పు" అంది రమ్య నెమ్మదిగా. నడవలో అడుగుల చప్పుడు వినగానే రమ్య హెచ్చు స్వరంతో అంది, "అనవసరంగా నా మీద అనుమానపడి నన్ను కించపరిచావు. గొలుసూ, గడియారమూ నీ చేతి సంచిలోనే ఉంచుకొని నా మీద అభాండం వేశావు. మాట వరసకే అన్నా నన్ను తడిమి చూసి కాని వదల్లేదు."

"వాటిని చేతి సంచిలో ఉంచిన సంగతి మరిచిపోయాను. అది సొరుగులో మూలకంటా వెళ్ళిపోవడంతో ఈ ఉదయం చేతికి అందలేదు. రమ్యా, నన్ను దయచేసి క్షమించు. ఈ గదిలో నీ వస్తువు ఏదైనా కనబడకపోతే ముందుగా అడిగేది నన్నే కదూ?" సుజాత ప్రాధేయపూర్వకంగా అంది. అంత అయోమయ పరిస్థితిలోనూ అతికినట్టు అబద్ధమాడింది.

"అఘోరించావుకానీ బయట భీమా విలాస్‌లో మంచి విందు ఇప్పించు. రెండవ ఆట చలన చిత్రానికి పోదాం. ఖర్చు నీదే సుమా?" అంది రమ్య.

"శ్యామలాదేవిగారు అనుమతినిస్తారా?" సుజాత సందేహం వ్యక్తపరిచింది.

"నేను వెళ్ళి అనుమతి తీసుకు వస్తాను. ఈ లోపుగా నువ్వు తయారవ్వు" అంటూ రమ్య బయటకు వెళ్ళింది. వార్త వెంటనే అందరికీ తెలిసిపోయింది. కొంతమంది ఓసారి గదిలోకి

తొంగి చూసి వస్తువులు దొరికినందుకు అభినందించి వెళ్ళారు. వారిలో నవ్య కూడా ఉంది.

అనుమతి దొరికిందంటూ రమ్య త్వరలోనే తిరిగి వచ్చింది. రమ్య మరో ఇద్దరు స్నేహితురాళ్ళను కూడా తీసుకు వచ్చింది. అందరు కలిసి బయలుదేరారు.

రాత్రి తొమ్మిదిన్నర ప్రాంతంలో శ్యామలా దేవి అలవాటు ప్రకారం వసతిగృహ సంచారం మొదలుపెట్టింది. నడవలన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి. రమ్యా, సుజాతల గది గొళ్ళెం పెట్టి ఉంది కానీ తాళం వేసి లేదు. శ్యామలాదేవి అటూ ఇటూ చూసి, తలుపు తీసి లోపల ప్రవేశించింది. ఎదురుగా సుజాత బల్లమీద విద్యుద్దీపం నవెలుగుతోంది. దీపం వెల్తుర్లో బల్లమీదనున్న సంఖ్యా సంకేత గడియారం కొట్టవచ్చినట్టు కనబడుతోంది. శ్యామలాదేవి తొందరగా బల్లవద్దకు వెళ్ళి, రవికలో దాచిన అదే రకమైన గడియారాన్ని బయటకు తీసి బల్లమీద ఉంచి, బల్లమీదనున్న సుజాత గడియారాన్ని తీసి రవికలో దాచుకొని వెనుదిరిగింది.

గదిలో ఉన్న పాదరస విద్యుద్దీపం ఒక్కసారిగా వెలిగింది. గుమ్మానికి అడ్డంగా రమ్యా, సుజాతా, స్నేహితురాళ్ళూ నిలబడి ఉన్నారు. శ్యామలాదేవి ముఖంలో కత్తివాటు వేస్తే నెత్తురుచుక్క లేదు.

"అమ్మా శ్యామలాదేవిగారూ! మీ ఆట కట్టు! మీ రవికలో దాచిన ఆ గడియారాన్ని ఇటు ఇవ్వండి!" అంది రమ్య చెయ్యి చాస్తూ.


శ్యామలాదేవి వణుకుతున్న చేతుల్తో తన రవికలోదాచిన గడియారాన్ని తీసి రమ్యకి అందించింది. రమ్య సుజాత బల్లమీదనున్న గడియారాన్ని కూడా తీసుకొని, రెండింటినీ అందరికీ చూపిస్తూ, "ఈ రెండు గడియారాల ఉదంతం మీకందరికీ చెప్తాను. తప్పు చేశానో, ఒప్పు చేశానో మీరే చెప్పాలి. ముందస్తుగా శ్యామలాదేవిగారు కొన్ని ప్రశ్నలకి సమాధాన మివ్వాలి" అంది గంభీరంగా. ఆ రాత్రంతా శ్యామలాదేవి వసతిగృహ నిర్బంధంలో ఉండిపోయింది.

❋ ❋ ❋

జిల్లా రక్షకభట శాఖాధికారులూ, రహస్య సమాచార సేకరణాధికారులూ, ప్రవేశార్హతా పరీక్ష సంస్థాధికారులూ, విద్యాశాఖ మంత్రిగారి

## నేను చాలా సెక్సీగా ఉంటాను

"నేను చాలా సెక్సీగా ఉంటాను. నా అందం నాకే ఈర్ష్యగా ఉంటుంది" అంటూ గర్వంగా చెప్పింది నమిత. తెలుగులో అవకాశాల్లేక తమిళ పరిశ్రమలో నిలదొక్కు కోవడానికి ప్రయత్నాలు చేస్తున్న ఈ అమ్మడిని ఇదే విషయం అడిగితే "ఎక్కడ అవకాశముంటే అక్కడికెళ్ళాలి. అందులో తప్పేముంది?" అంటూ అసలు పాయింటు చెప్పు కొచ్చింది. స్టీవెన్ కపూర్‌తో చెట్టాపట్టా లేసుకుని తిరిగిన అమ్మడు తనకు మామూలు బాయ్‌ఫ్రెండ్సైతే ఉన్నారు కానీ, ప్రేమ వ్యవహారం మటుకు తెలియదంటూ అమాయకత్వం వెలిబుచ్చింది. వీరి ప్రేమ వ్యవహారం మనకు తెలియదను కుంటుందేమో మరి!



విభాగంలోని కొంతమంది ఉన్నతాధికారులూ రమ్య చెప్పిన కథనాన్ని శ్రద్ధగా విన్నారు.

"రాకేష్ పట్టభద్రుడు. ప్రశ్నాపత్ర ముద్రణాలయంలో ముద్రారాక్షస సవరణ కారుడిగా పనిచేస్తున్నాడు. ఒక రైలు ప్రయా ణంలో జరిగిన పరిచయం సుజాతా, రాకేష్‌ల మధ్య ఇప్పుడిప్పుడే అభిమానమో, ప్రేమో తెలియని పరిస్థితిగా మార సాగింది. రాకేష్ సుజాతకి పుట్టిన రోజు కానుకగా ఓ సంఖ్యా సంకేత చేతి గడియారాన్ని బహూకరించాడు.

"అటు మొన్న సాయంత్రం కాస్త పొద్దుపోయిన తర్వాత సుజాత చాలా ఉత్సాహంగా గదికి వచ్చి, చేతినున్న గడియారాన్ని తీసి బల్లమీద పెట్టి స్నానానికని వెళ్ళింది. అటువంటి గడియారాన్ని చూడ్డం నాకదే మొదటిసారి. కుతూహలంతో నేను గడియారాన్ని తీసి యాధాలాపంగా ఓ మీట నొక్కాను. ఏదో చిన్నగా కీచుమని శబ్దం వినవచ్చింది. చెవికి దగ్గరగా పెట్టుకొని విన్నాను. కీచు శబ్దం ఆగిపోయి ఏదో మధుర సంభాషణలు విన వచ్చాయి. 'నువ్వంటే నాకు చాలా ఇష్టం సుజా!.. నువ్వంటే నాకూ ఇష్టమే రాకేష్!' వగైరా వగైరా వెంటనే మళ్ళీ మీట నొక్కి ఆ గడియారాన్ని సుజాత బల్లమీద ఉంచేశాను. ఆ గడియారాన్ని గురించి నేను అడగను లేదు, సుజాత ఏమీ చెప్పనూ లేదు.

"మొన్న సాయంత్రం పొద్దుపోయిన తర్వాత సుజాత ఆ గడియారాన్ని నాకు చూపిస్తూ వాళ్ళ నాన్నగారిచ్చిన పుట్టినరోజు కానుక అని చెప్పింది. ఆ రోజు సాయంత్రం ఏం మాట్లాడుకున్నారో అన్న కుతూహలంతో, సుజాత స్నానానికి వెళ్ళినప్పుడు గడియారం తీసి, మీట నొక్కి విన్నాను.

"రాకేష్ గొంతూ, మరొకరి గొంతూ వినబడ్డాయి. ఆ సంభాషణ ఇలా సాగింది. "వాసుదేవరావుగారూ, మీరు వ్రాత ప్రశ్నా పత్రాన్ని నెమ్మదిగా చదువుతూ ఉండండి. నేను మీరు అచ్చు వేసిన మొదటి చిత్తు ప్రతిని జాగ్రత్తగా దిద్దుతాను. ఒక్క అక్షరం కానీ, సంఖ్య కానీ అటు ఇటూ అయితే కొంపలంటుకుంటాయి. అలాగేనండి రాకేష్‌గారూ.. సరే మొదలుపెట్టండి. సాంకేతిక, వైద్య విద్యా ప్రవేశార్హత పరీక్షా పత్రము, తెలుగు మాధ్యమము, రసాయనక శాస్త్రము.. ఆ తర్వాత ఒకటొకటిగా ప్రశ్నలు వినవచ్చాయి. సుజాత ఎప్పుడు తిరిగి వచ్చేస్తుందేమోనన్న తొందరకొద్దీ మీట తిరిగి నొక్కి దాన్ని బల్లమీద ఉంచేశాను. తను స్నానం చేసి వచ్చిన తర్వాత ఇద్దరమూ


భోజనశాలకి వెళ్ళి, రాత్రి భోజనం చేసి వచ్చాము. వచ్చీ రావడంతో సుజాత మంచమెక్కి ముసుగు తన్నింది.

"ఆ రాత్రల్లా ఆలోచనలతో నిద్రపట్టలేదు. సుజాతకి ఈ విషయంలో ప్రమేయం లేదనీ, గడియారాలు తారుమారై వుండొచ్చనీ ఓ అభిప్రాయానికి వచ్చాను. నిన్న ఉదయం సుజాత స్నానానికి వెళ్ళినప్పుడా గడియారాన్ని తీసి నా ఎడమ పాదరక్షలో దాచి బీరువా కిందకి తోశాను. నేను కనక ఊరుకుంటే గడియారాన్ని తిరిగి మార్చడం రాకేష్‌కి చాలా సులువు. పోయిందని దుమారం లేపితే ప్రమేయం ఉన్నవాళ్ళు బయటపడకపోతారా అన్న ధీమాతో ప్రవర్తించాను. 'పోతే పోయిందిలే' అన్న రాజీ పరిస్థితికి వచ్చిన సుజాతని చూసి, ఆమెపట్ల నా అభిప్రాయం సరైనదేనని ఓ నిశ్చయానికి వచ్చాను. విషయం అంతు చూడందే వెనుతిరగదలచుకోలేదు. నవ్య తన సహజమైన వాచాలత్వంతోనూ, చెంచాగిరీతోనూ తనకి తెలియకుండానే నా ప్రయత్నానికి సహాయం చేసింది.

"ఇక గడియారాల తారుమారు ఎలా జరిగి ఉంటుందో సజాత చెప్పింది. మొన్న సాయంత్రం వాళ్ళు ఉద్యానవనంలో కూర్చుని మంచు మీగడ తింటుండగా, రెండు కోతులు చెట్టుమీద నుంచి దుమికి వాళ్ళ చేతుల్లోని మంచు మీగడలెత్తుకొనిపోయాయి. రాకేష్ చేతుల్నిండా మంచు మీగడ అంటుకొంది. 'చేతులు కడుక్కొని వస్తాన'ని రాకేష్ తన చేతి గడియారాన్ని సుజాత చేత తీయించి, కాస్త దూరంలో ఉన్న నీటి కుళాయి వద్దకు వెళ్ళి చేతులు కడుక్కొని వచ్చాడు. ఆ లోపుగా సుజాత కూడా తన చేతికున్న గడియారాన్ని తీసి, చేతి సంచిలో ఉన్న పన్నీటి ఉల్లిపొర కాయితం ఉన్న పొట్లాం తీసి, చింపి, ఆ కాయితంతో తన చేతులు శుభ్రపరచుకొని, తిరిగి గడియారాన్ని ధరించింది. అప్పుడే గడియారాలు తారుమారయ్యాయి. బిర్రుపట్టీలు కావడం మూలాన సుజాతకి తేడా తెలియలేదు.

"మా నిర్బంధంలో శ్యామలాదేవి గళం విప్పిన కారణంగా తెలిసిన వివరాలేమంటే గడియారం తారుమారైన సంగతి రాకేష్ ఇంటికి వెళ్ళగానే గ్రహించాడు. నిజానికి ఆ గడియారాన్ని ఆ రాత్రికే శ్యామలాదేవికి అంద చెయ్యాలి. రాకేష్ దూరశ్రవణ యంత్రంలో జరిగింది శ్యామలాదేవికి చెప్పి, మర్నాడు సాయంత్రం సుజాతని కలుసుకొన్నప్పుడు గడియారాన్ని మారుస్తాననీ, కంగారు పడవద్దనీ ధైర్యం చెప్పాడు. ఒకవేళ సుజాత ప్రశ్నాపత్రం విని ఉంటే అన్న శ్యామలాదేవి సందేహానికి, ఆమె నోరు మెదపకుండా ఉంటే బాధ్యత తనదేనన్నాడు.

"నిజంగా అదేకనక జరిగి ఉంటే, రాకేష్ సుజాతనేం చేసేవాడో, ఎలా మభ్యపెట్టేవాడో నా ఊహకందని విషయం. నిన్న గడియారం గదిలోంచి మాయమైన సంగతిని శ్యామలాదేవి, రాకేష్‌ని కలుసుకోడానికి ప్రయత్నించింది. వాళ్ళ నాయనమ్మకి తీవ్ర అస్వస్థతగా ఉండడం మూలాన రాకేష్ విజయవాడ వెళ్ళాడని తెలిసింది. సుజాతకి గడియారం తిరిగి దొరికిందన్న సమాచారం అందగానే, కంగారు పడి తన దగ్గరున్న అటువంటి గడియారాల్లో ఒకదాన్ని తీసుకొని, సుజాత గడియారాన్ని మార్చ ప్రయత్నించి పట్టుబడిపోయింది" రమ్య తన కథనం ముగించింది.




"శ్యామలాదేవిని ఎప్పుడు అనుమానించావు?" ఓ అధికారి ప్రశ్నించాడు.

"వాస్తవానికి శ్యామలాదేవి మా గదిలో అడుగుపెట్టే వరకూ నేను ఎవర్నీ ఆ స్థానంలో ఊహించలేదు. ప్రమేయం ఉన్నవాళ్ళు ఏదో పావు కదల్చకపోతారా అన్న నా ఊహ నిజమైంది. అయితే, అడిగిన వెంటనే చలన చిత్రానికి వెళ్ళడానికి అనుమతిని ఇవ్వడంతో శ్యామలాదేవి మీద ఓ చిన్న అనుమానపు రేఖ ప్రసరించకపోలేదు" రమ్య నిజాయితీగా సమాధానమిచ్చింది.

'రుబ్బు' వసతి కళాశాల మరియు శిక్షణా కేంద్రం అధినేత విద్యా విక్రయరావునీ, వసతి గృహ సంరక్షకురాలు శ్యామలాదేవినీ, రాష్ట్రంలో ఉన్న మరికొంతమంది శిక్షణా ప్రవీణుల్నీ, రాకేష్‌నీ నిర్బంధంలోకి తీసుకున్నారు. విద్యావిక్రయరావు ఇంట్లో కొన్ని సంబంధిత శబ్దవర్థకాలూ, పరికలన పరికరాలూ దొరికాయి. ఆ ముగ్గురివద్దా అతిసాంద్ర శబ్ద నిక్షిప్త బింబాలున్న మరికొన్ని సంఖ్యా సంకేత హస్త ఘటీ యంత్రాలు దొరికాయి. వాటిల్లో ప్రశ్నాపత్ర పఠనం అంతా నిక్షిప్తం చెయ్యబడుతుంది. ముద్రణాలయంలోకి వెళ్ళేటప్పుడూ, బయటకు వచ్చేటప్పుడూ భద్రతా పరిశీలకులకి, చేతి గడియారాన్ని అనుమానించే ఆస్కారం లేదు.

ఈ విధంగా ఉన్నత విద్యల ప్రవేశ పరీక్షల, ఉద్యోగాల ఎంపిక పరీక్షల ప్రశ్నా పత్రాలని తస్కరించి, వాళ్ళవాళ్ళ శిక్షణా కేంద్రాలకి పేరు ప్రఖ్యాతులు సంపాదించడం జరిగింది. కోట్ల కొద్దీ ధనార్జన చెయ్యడం జరిగింది. తాము కూడా ప్రయోజనం పొందే అవకాశమున్నా, రమ్య తన స్నేహబృందంతో కలిసి ఈ కుంభ కోణాన్ని బట్టబయలు చేసినందుకు పత్రికా సంపాదకులూ, కొంతమంది నిజాయితీపరులైన అధికారులూ ప్రశంసల వర్షం కురిపించారు. సుజాతకి కూడా ప్రశంసలు లభించినా తండ్రి చేత చివాట్లు తప్పలేదు.

అయితే కొంతమంది విద్యార్థులూ, వారి తల్లిదండ్రులూ రమ్య బృందానికి పెట్టని శాప నార్థాలు లేవు.

సాంకేతిక విప్లవాన్ని ఎలా ఉపయోగించుకోవాలీ అన్నది ప్రజల చేతుల్లోనే ఉంది. నైతికి విలువలు జారిన వ్యక్తుల చేతుల్లో అది దేశం భ్రష్టుపట్టిపోవడానికి బాటలు చూపిస్తుంది. ఎందరో ప్రతిభావంతులు సాధించిన సాంకేతిక ప్రగతిని, పరీక్షలలో అగ్రస్థానాలు లేదా హెచ్చు స్థాయిలో సంపాదించే వక్రమార్గంలో ఉపయోగిస్తే విద్యార్థులకు అంతకు మించిన ఆత్మవంచన లేదు. ✵